# రేపటి నుంచి గురు పూర్ణమి వేడుకలు

**లక్షమంది భక్తులకు ఏర్పాట్లు**



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

**చైతన్యపురి:** దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో శనివారం నుంచి మూడ్రోజుల పాటు గురుపూర్ణమి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ శ్యామ్‌కుమార్ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను గురువారం సాయిట్రస్ట్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శనివారం ఉదయం 9 గంటలకు శ్రీసాయి లక్ష పుష్పార్చన, 10 గంటలకు శ్రీగురుపాదుకా పూజ కార్యక్రమం, 12 గంటలకు అఖండ హారతి ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు పంచామృతాలతో అష్టోత్తర శత కలశాభిషేకం, 8.30 గంటలకు సామూహిక శ్రీసాయి సత్యవ్రతాలు, సాయంత్రం 7.30 గంటలకు 108 మంది మహిళా భక్తులచే శ్రీసాయి కలశ దీపాలతో శోభాయాత్ర, సోమవారం సాయంత్రం 7 గంటలకు బాబా వారి పల్లకి ఊరేగింపు ఉంటుందన్నారు.

● గురుపూర్ణిమ ఉత్సవాలకు సుమారు లక్షమంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చైర్మన్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మరింతా మంది ప్రముఖులను ఆహ్వానిస్తున్నామన్నారు. పోలీస్, జీహెచ్ఎంసీ అధికారుల సహకారంతో ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సరఫరా, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు, వీఐపీలు, దాతలకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా బాబా దర్శనం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రఘుకుమార్, మాజీ చైర్మన్లు గుండమల్లయ్య, వనం యాదయ్య, బచ్చు గంగాధర్, కిరణ్ రాజశేఖర్, ఆర్ఎస్ శంకర్‌రావు, పద్మారావు ఆత్రే పాల్గొన్నారు.

# కబ్జాదారుల నుంచి స్థలాన్ని కాపాడాలి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న నర్సింహాగుప్తా

**చైతన్యపురి:** చైతన్యపురి డివిజన్ భవానీనగర్ కాలనీలో కబ్జా అయిన స్థలాన్ని కాపాడి కాలనీవాసులకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహాగుప్తా ఆధ్వర్యంలో కాలనీవాసులు జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. కాలనీలోని 350 గజాల స్థలాన్ని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారని డీసీ దృష్టికి తీసుకొచ్చారు. కబ్జాదారుడు దరఖాస్తును రద్దు చేసి స్థానికులకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్, జి.లక్ష్మినారాయణ, వెంకట్‌రెడ్డి, చిన్నా, రవీందర్‌రెడ్డి, నాయకులు వినోద్‌యాదవ్, రామ్మోహన్ ఉన్నారు.

**డీసీకి కార్పొరేటర్ వినతి**

**చైతన్యపురి:** డివిజన్‌లోని పలు కాలనీలలో ఉన్న ప్రైవేటు హాస్టళ్లతో తలెత్తుతున్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి హాస్టల్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి గురువారం సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. ఎలాంటి అనుమతులు లేకుండా వివిధ కాలనీలలో అక్రమంగా హాస్టల్స్ నడుపుతున్నారని ఇష్టారాజ్యంగా హాస్టళ్లు ఏర్పాటు చేయటంతో శానిటేషన్, డ్రైనేజీ, పార్కింగ్ సమస్యలతో పాటు తరచూ లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అన్ని విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి హాస్టళ్ల అనుమతులు గురించిన సమాచారాన్ని సేకరించి స్థానికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని డీసీని కోరారు.

## కార్పొరేషన్ బలోపేతానికి కృషి



వీరయ్య

**చాదర్‌ఘాట్:** 33 జిల్లాలకు ప్రధాన కార్యాలయంలో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఇతర శాఖలలో డ్యూటీ చేస్తున్న సిబ్బంది తిరిగి ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని వికలాంగుల సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య ఆదేశాలు జారీ చేశారు.గురువారం మలక్‌పేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన కార్యాలయంలో సిబ్బంది కొరతతో కనీసం ఇతర జిల్లాల నుంచి వచ్చే వికలాంగులకు సమాధానం చెప్పే పరిస్థితులు లేవన్నారు. కార్పొరేషన్‌లో ఉన్న సమస్యలపై ఉద్యోగుల సంఘాలు, ఎండీతో చర్చించి కార్పొరేషన్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

## రైతు బజారులలో కూరగాయల ధరలు



**వనస్థలిపురం:** సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 63, వంకాయ రూ. 28, బెండ రూ. 28, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 38, బీర రూ. 23, క్యాబేజి రూ. 30, ఫ్రెంచి బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 35, దొండ రూ. 28–30, చిక్కుడు రూ. 75, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 28, క్యాప్సికం రూ. 65, ఆలు రూ. 38, దోస రూ. 19, సొర రూ. 9, పొట్ల రూ. 15, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 37. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

# పెండింగ్ నీటి బిల్లుల రద్దుకు ధర్నా



మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

**నాగోలు:** బకాయి తాగునీటి బిల్లులను రద్దు చేయాలని బండ్లగూడ వద్ద ఉన్న రాజీవ్ స్వగృహ (సహభావన టౌన్‌షిప్)సి–బ్లాక్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ వాసులు గురువారం బండ్లగూడ తట్టిఅన్నారం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. 2023లో తమకు ఈ ప్లాట్లు విక్రయించారని అంతకు ముందున్న వారు నీటిని వాడుకొని బిల్లు కట్టలేదన్నారు. గతంలోని పెండింగ్ బిల్లులు తమను కట్టాలని జలమండలి అధికారులు నోటీసులు జారీ చేశారని కట్టకుంటే నీటి కనెక్షన్ తొలగిస్తామని వేధిస్తున్నారన్నారు. గతంలో రాజీవ్ స్వగృహ అధికారులు పెండింగ్ బిల్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న రాజీవ్ స్వగృహ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ స్పందించి జలమండలి ఎండీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 1.10 కోట్లు బకాయిలను రద్దు చేయాలని లేకుంటే రాస్తారోకోలు, ర్యాలీలు చేస్తామని హెచ్చరించారు.

# రైతులకిచ్చిన హామీని నెరవేర్చిన రేవంత్ సర్కార్



రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం శ్రీనివాస్



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**మలక్‌పేట:** ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతురుణ మాఫీ చేసిన సందర్భంగా పార్టీ పిలుపు మేరకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మలక్‌పేటలో సంబరాలు జరుపుకున్నారు. రైతులతో కలిసి బాణా సంచాకాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆత్మగౌరవంతో బతకాలని ఏకకాలంలో రూ.30 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయడం సహసోపేత నిర్ణయమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరహా ఇచ్చిన హామీలు నెరవేర్చి రేవంత్‌రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ షకీల్, చక్రపాణి, రాహుల్‌సింగ్, షాహెద్‌ఖాన్, సంతోష్‌యాదవ్, లింగాల శ్రీనివాస్, విఘ్నేష్, మహేష్, భాస్కర్, సాయిరామ్, మధు పాల్గొన్నారు.

**మూసారంబాగ్‌లో..**

సీఎం రేవంత్‌రెడ్డి రైతురుణ మాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మూసారంబాగ్ కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో బొట్టు శ్రీనివాస్, బద్దం సురేందర్‌రెడ్డి, సంగేపాక ధర్మేందర్, సాయికిషోర్ పాల్గొన్నారు.

# ఆఖరి మజిలీకి అన్నీతామై..



**వనస్థలిపురం:** విదేశాలు, విహారయాత్రలకు వెళ్లాలన్నా ఆయా సంస్థలు ట్రావెలింగ్, వసతి, భోజనం తదితర ఏర్పాట్లతో ప్రత్యేక ప్యాకేజీలను ఇస్తుండటం సర్వ సాధారణం.అదే విధంగా నగరంలో ఓ వ్యక్తి చనిపోతే దహన సంస్కారాల కోసం కొన్ని శ్మశాన వాటికల్లో నిర్వాహకులు ప్రత్యేక ప్యాకేజీని ఇస్తున్నారు. వారు నిర్ణయించిన ప్రకారం డబ్బులు చెల్లిస్తే ఇంటి నుంచి శ్మశానవాటికకు శవాన్ని తరలించడం మొదలు అంత్యక్రియల నిర్వహణ బాధ్యత పూర్తిగా వారే చూసుకుంటున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో సాహెబ్‌నగర్ శ్మశాన వాటిక, కర్మన్‌ఘాట్ భూపేశ్‌గుప్తనగర్ శ్మశాన వాటికల్లో ఈ ప్యాకేజీలు కొనసాగుతున్నాయి. డబ్బులు ఖర్చయినా అంత్యక్రియల సందర్భంగా సామగ్రి, వాహనం, బ్యాండ్, లేబర్, పూలు తదితర ఏర్పాట్ల కోసం నలుదిక్కులా తిరగాల్సిన పని లేకుండా ఓ ప్యాకేజీతో అన్నిపనులు శ్మశానవాటిక నిర్వాహకులే చూస్తుండడంతో శ్రమ తప్పుతుందని పలువురు చెబుతున్నారు.



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని శ్మశాన వాటిక

● దహన సంస్కారాలకూ ప్యాకేజీ
● చెప్పిన డబ్బులిస్తే అన్ని పనులు వారే..
● నగరంలోని పలు శ్మశానవాటికల్లో కొనసాగుతున్న ప్యాకేజీలు

**సాహెబ్‌నగర్ శ్మశాన వాటికలో రూ. 33 వేలు..**

వనస్థలిపురం సాహెబ్‌నగర్ శ్మశానవాటికలో రూ. 33 వేలతో అంత్యక్రియల నిర్వహణ చేపడుతున్నారు. ఎవరైనా చనిపోతే నిర్వాహకులకు ముందుగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో వారు ఇంటి వద్దకు పరమపద రథం (వ్యాన్)ను పంపించడంతో పాటు పాడే కట్టే సిబ్బంది, పూజ సామగ్రిని, బ్యాండ్ మేళాన్ని పంపిస్తారు. శవాన్ని తరలించే వ్యాన్‌ను పూలతో అలంకరిస్తారు. అనంతరం శవాన్ని శ్మశాన వాటికకు తరలించి అక్కడ దహన సంస్కారాలు నిర్వహిస్తారు. ఇక్కడ దహన సంస్కారాలు చేసిన వారికి బరెల్ గ్రౌండ్ రిపోర్ట్ ఇస్తారు. వారు మున్సిపాలిటీ నుంచి డెత్ సర్టిఫికేట్(మరణ ధృవీకరణ పత్రం) తీసుకోవచ్చు.

**ఇతర ఖర్చులు వేరే...**

దహన సంస్కారాలు రూ. 33 వేల ప్యాకేజీతో అయిపోయినా ఇతర ఖర్చులు మరికొన్ని ఉంటాయి. దశదిన సందర్భంగా గుండ్లు కొట్టించడానికి ఇక్కడ ఒక్కో గుండుకు రూ. 300 చొప్పున నాయీ బ్రాహ్మణులు వసూలు చేస్తారు. అలాగే గాజులు తీయడం, బట్టలు ఉతకడానికి చాకలికి రూ. 2000 చెల్లించాలి. ఇక చావు రోజు, మూడవ, పదో రోజు ఖర్మకాండం సందర్భంగా అయ్య వారికి ఓ ప్యా కేజిగా రూ. 10,000 నుంచి 15,000 వరకు ఇవాల్సి ఉంటుంది.

**ఏర్పాట్లన్నీ మేమే చేస్తాం..**

ఎవరైనా చనిపోతే తమకు ముందుగా సమాచారం ఇస్తే అన్ని ఏర్పాట్లు మేమే చేస్తాం. రూ. 33 వేల ప్యాకేజీతో వాహనాన్ని పంపించడం మొదలు, పాడే కట్టడం, పాడే సామగ్రి, వాహనం అలంకరణ, దహన సంస్కారం మొత్తం మేమే చేస్తాం. ఎవరైనా పేదవారు వారే శవాన్ని తీసుకుని నేరుగా వస్తే వారికి జీహెచ్ఎంసీ నిర్ణయించిన ఫీజు ప్రకారం కట్టెలు, లేబర్ కోసం రూ. 8 వేలు తీసుకుని దహన సంస్కారాలు నిర్వహిస్తాం. ఇక్కడ దహన సంస్కారాలు చేసిన వారికి మేమే బరెల్ గ్రౌండ్ రిపోర్ట్ ఇస్తాం, దీని ద్వారా వారు మున్సిపాలిటి నుంచి డెత్ సర్టిఫికేట్ తీసుకోవచ్చు. అలాగే మా వద్ద అస్తికల కోసం ఉచిత లాకర్ సౌకర్యం ఉంది.

– వి.జగదీష్, ఇన్‌చార్జి, సాహెబ్‌నగర్ శ్మశానవాటిక

## ఇంటి స్థలం వివాదంలో మహిళపై దాడి

పలువురిపై కేసు నమోదు

**హయత్‌నగర్:** ఇంటి స్థలం వివాదంలో మహిళపై దాడి చేసిన ఘటన హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. బాగ్‌హయత్‌నగర్ స్వాతి రెసిడెన్సీ సమీపంలోని రాఘవేంద్రా కాలనీలో సర్వే నెంబర్ 194/1లోని ఓ ఇంటి స్థలం విషయంలో ఇరు వర్గాల మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో దాసరి అశ్విని ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతుంది.బుధవారం సాయంత్రం ఈ స్థలం తమదని ఇంటి నిర్మాణాన్ని నిలిపి వేయాలని కొందరు వచ్చి వివాదానికి దిగి అశ్వినిపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## భార్యను చంపిన భర్తకు జీవితఖైదు

**రంగారెడ్డి కోర్టులు:** భార్యను చంపిన భర్తకు జీవితఖైదు విధిస్తూ రంగారెడ్డి జిల్లా 2వ అదనపు కోర్టు న్యాయమూర్తి సి.రత్న పద్మావతి తీర్పు వెలువరించారు. కోర్టు ఏపీపీ రాము తెలిపిన వివరాలివి... జల్‌పల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ ఫహియుద్దీన్‌కు తహ్సీన్ సల్మా అనే యువతితో నాలుగు నెలల క్రితం వివాహమైంది. అయితే పెళ్లి అయిన నాటి నుంచి ఆమెను భర్త వేధిస్తున్నాడు. ఈ క్రమంలో 2016 సెప్టెంబర్ 23న గొంతు నులిమి ఆమెను ఫహియుద్దీన్ చంపేశాడు. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు వెలువరించారు.

## ఆలయ నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం



ఆలయ నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న సభ్యులు

**ఎల్‌బీనగర్:** బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో టీచర్స్ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి అభయ అయ్యప్ప సేవా సమితి సభ్యులు రూ.25 లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురువారం సాగర్ కాంప్లెక్స్ రేణుక రాజరాజేశ్వరీ పీఠం శ్రీనవీన్ శర్మ, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సమక్షంలో రూ.5 లక్షల చెక్కును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి రూ.25లక్షలు విరాళం ఇవ్వడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వల్లపురెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, ఆలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, కార్యదర్శి బుచ్చిరెడ్డి, నాయకులు నరసింహరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆదిత్యశర్మ, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా




కాలనీలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్, కార్పొరేటర్

**ఎల్‌బీనగర్:** తన దృష్టికి వచ్చిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు.బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్–1లో గురువారం ఆయన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలలో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యలు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ కోరారు. అలాగే కాప్రాయి చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య, డీసీ సువర్చల, ఈఈ రమేష్ బాబు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావని, డీఈ దామోదర్‌రావు, ఏడీ రామచంద్రరావు, నాయకులు పురుషోత్తంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ధన్‌రాజ్, నవీన్ కుమార్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# అమ్మోరి చిత్రం.. బోనాలకు సిద్ధం







అమ్మవారి చిత్రపటం వేస్తున్న రాము

బోనాల వేడుకలకు దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. వివిధ ప్రాంతాలల్లో దేవాలయాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎల్‌బీనగర్‌కు చెందిన చిత్రకారుడు, కార్టూనిస్ట్ నాగార్జునపు రాము నగరంలోని వివిధ అమ్మవారి దేవాలయాలను తన కుంచెతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నాడు. ఎల్‌బీనగర్ ప్రాంతాల వివిధ కాలనీలోని అమ్మవారి దేవాలయాల గోడలకు అమ్మవారి చిత్రాలను వేస్తూ ఆకట్టుకుంటున్నాడు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. ప్రతి ఏడాది నగరంలోని వివిధ దేవాలయాలను దాదాపు నెల రోజుల్లో 10 నుంచి 15 దేవాలయాలను పూర్తి చేస్తానని ఈ అవకాశం ఇస్తున్న దేవాలయాల కమిటీ వారికి కృతజ్ఞతలు అన్నాడు.

– నాగోలు

## మూసారంబాగ్‌లో కార్పొరేటర్ పర్యటన



కార్పొరేటర్ భాగ్యలక్ష్మికి సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

**మలక్‌పేట:** మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి గురువారం డివిజన్‌లో పర్యటించారు. బోనాల పండుగ నేపథ్యంలో ఆయా కాలనీలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ఆలయాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతానన్నారు. ఆలయాల వద్ద కొనసాగుతున్న పనుల్లో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ నిర్వాహకులు, కాలనీవాసులు సమన్వయంతో బోనాలు పండుగ ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్పొరేటర్ వెంట సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు సంతోష్, దినేష్, బాలరాజు, శ్రీకాంత్, సురేష్ ఉన్నారు.

## పాఠశాలల్లో వసతుల కల్పనకు వినతి



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**మలక్‌పేట:** ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సైదాబాద్ డిప్యూటీ ఐఓఎస్ వరప్రసాద్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్యయాదవ్ మాట్లాడుతూ.. సర్కార్ బడుల్లో సరైన వసతులు లేక విద్యార్థులు, ముఖ్యంగా బాలికలకు బాత్రూమ్ శుభ్రంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తరగతి గదిలో బెంచీలు లేక నేలమీద కూర్చుని పాఠాలు వినాల్సి వస్తోందన్నారు. పాఠశాలలో ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల కొరత ఉందని, వాటిని భర్తీ చేయాలన్నారు. పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

## తొలగిన చెత్త



జేసీబీతో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

**బడంగ్‌పేట్:** బాలాపూర్ పరిసరాల్లో రోడ్డు పక్కన వేసిన చెత్తను అధికారులు గురువారం సిబ్బందితో తరలించారు. ఈ మేరకు 'పరిశుభ్రత లోపించి.. దుర్గంధం వ్యాపించి' అనే శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనికి బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి సిబ్బందితో వచ్చి జేసీబీ సాయంతో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లలోకి ఎక్కించి అక్కడి పరిసరాలను శుభ్రం చేయించారు. బోనాల పండగకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. డిప్యూటీ మేయ ర్ ఇబ్రాం శేఖర్ విచ్చేసి పనులను పరిశీలించారు. చెత్త డంపింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**కాచిగూడ:** నార్త్ అమెరికా పద్మశాలి అసోసియేషన్ (నాపా) ఆధ్వర్యంలో అఖిల భారత పద్మశాలి సంఘం సహకారంతో గ్రూప్–1, మెయిన్స్–24 పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పద్మశాలి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి తెలిపారు. విద్యార్థులు శిక్షణ తీసుకునేందుకు కావాల్సిన ఆర్థిక సహకారంతో పాటు మార్గదర్శకం చేస్తామన్నారు. నాపా వారి ఆధ్వర్యంలో పరికిపండ్ల నరహరి (ఐఏఎస్) దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థులను ఎంపిక చేస్తానన్నారు. వాట్సాప్ నం: 86399 98711లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## పరామర్శ కాదు.. పరిహారం అందించాలి

**జవహర్‌నగర్:** ముఖ్యమంత్రి పరామర్శ కాదని బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో వీధి కుక్కల దాడికి బాలుడు మృతి చెందిన ఘటనా స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ... ఇక్కడున్న పేదలపై ప్రభుత్వానికి పట్టింపులేదని, మున్సిపల్ అధికారులు, పోలీసులు, మరోవైపు రెవిన్యూ అధికారులు చిన్నచూపు చేస్తున్నారని మండిపడ్డారు. జవహర్‌నగర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలను స్థానికులకు కేటాయించాలని, నగరంలో ఎక్కడో నివసిస్తున్న వారికి ఇక్కడ ఇండ్లను కేటాయించడం సరైన పద్ధతి కాదన్నారు.

**వీధి కుక్కలకు, గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా...**

వీధి కుక్కలకు, గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా జవహర్‌నగర్ మారిందని ఎంపీ ఈటల ధ్వజమెత్తారు. జవహర్‌నగర్‌లో ప్రభుత్వం అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించి సీసీ కెమరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రంగుల శంకర్, బీజేపీ జవహర్‌నగర్ అధ్యక్షుడు కమల్, నాయకులు మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదుకోండి.. బతికించండి!

ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న రోగి కుటుంబికులు



**చిక్కడపల్లి:** తెలుగు శ్రోతలను తన గాన మాధుర్యంతో రెండున్నర దశాబ్దాలుగా అలరిస్తున్న సాయి పావని భర్త ఎల్లోరా సురేష్ గుండెపోటుతో కోమాలోకి వెళ్లారు. కొన్ని నెలలుగా ఖైరతాబాద్‌లోని వాసవీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు కుటుంబ సభ్యులే ఖర్చులు భరిస్తూ వచ్చారు. ఆయన పూర్తిగా కోలుకోవడానికి రూ.10లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మానవతా దృక్పథంతో దాతలు సహాయం చేయాలని గాయకురాలు సాయిపావని కోరుతున్నారు. దాతలు ఫోన్ నం.94416 75680లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.